

# చీకటి వెలుగు

సామాజిక రాజకీయ ఆధ్యాత్మిక సాయంకాలపు దిన పత్రిక

నల్లగొండ, హైద్రాబాద్ | సంపుటి : 17 | సంచిక :274 | ఎడిటర్ : కంది సూర్యనారాయణ | 04-02-2026 బుధవారం | పేజీలు : 4 | వెల : రూ. 3



చీకటి వెలుగు దినపత్రిక

भास्कर वाणि दिन पत्रिका

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇంచార్జీలు, ఫొటోగ్రాఫర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు, డీటీపీ ఆపరేటర్లు కావలెను

ఎడిటర్ : కంది సూర్యనారాయణ

సెల్ : 9848052327




## నిబంధనలు పాటించాల్సిందే

**వాట్సాప్, మెటాలకు సుప్రీంకోర్టు హితవు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:**భారత రాజ్యాంగాన్ని పాటించలేకపోతే, దేశం విడిచి వెళ్లిపోవాలని ప్రఖ్యాత సోషల్ మీడియా కంపెనీలు వాట్సాప్, మెటాలకు సుప్రీంకోర్టు హితవు పలికింది. భారత ప్రజల గోప్యతా (ప్రైవసీ) హక్కును కాపాడే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాము రాజీపడేది లేదని దేశ సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. దేశంలోని కోట్లాది పేద, నిరక్షరాస్య ప్రజలకు మీ ప్రైవసీ పాలసీలు అర్థమవుతాయా అని వాట్సాప్, మెటాలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. పేద మహిళ, రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే నిరుపేద వ్యక్తి, ఎవరైనా తమిళం మాత్రమే మాట్లాడే వ్యక్తి లాంటి వాళ్లకు మీ ప్రైవసీ పాలసీలు అర్థమవుతాయా అని సోషల్ మీడియా కంపెనీలను సుప్రీంకోర్టు బెంచ్ నిలదీసింది. కొన్నిసార్లయితే తమలాంటి వ్యక్తులే ఆ పాలసీలను అర్థం చేసుకోలేక సతమతం అవుతుంటారని ధర్మాసనం - మిగతా3లో

## కడియం శ్రీహరికి స్పీకర్ నోటీసులు..

**అనర్హత పిటిషన్‌పై విచారణకు రావాలని ఆదేశాలు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 3**:తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల అంశం బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ పార్టీల మధ్య వివాదాన్ని హీటెక్కిస్తోంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు. బుధవారం (ఫిబ్రవరి 4న) ఉదయం 11 గంటలకు అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో స్పీకర్ పేర్కొన్నారు. పార్టీ మారిన కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.ఎన్నికల గుర్తుపై గెలిచి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయకుండానే వేరే పార్టీలో చేరడం రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ వాదిస్తోంది. కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయడంలో జాప్యం జరుగుతోందని గతంలోనే ఆ పార్టీ నేతలు హైకోర్టును కూడా ఆశ్రయించారు. విషయం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. అనర్హత పిటిషన్లపై చర్యలు తీసుకోవాలని, ఎందుకు జాప్యం చేస్తున్నారని - మిగతా3లో

## మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు దూకుడు పెంచిన బీజేపీ

**బుధవారం తెలంగాణ కి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్**

**హైదరబాద్:**తెలంగాణ లో జరగనున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు బీజేపీ దూకుడు పెంచింది. పార్టీ అగ్ర నేతలు పార్టీ ప్రచారానికి వస్తున్నారు. బుధవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ వస్తున్నారు. ఈ నెల 7 న మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, 8 న కేంద్ర హోం మంత్రి అమిత్ తెలంగాణ పర్యటన ఖరారయింది. నితిన్ నబిన్ బుధవారం మహబూబ్నగర్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. మధ్యాహ్నం 1 గంటకు శంషాబాద్ విమానాశ్రయంకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1:30 గంటలకు శంషాబాద్ నుండి మహబూబ్ నగర్ కు చేరుకుంటారు.తిరిటి సాయంత్రం సాయంత్రం 5:45 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి ఢిల్లీ కి వెళ్లనున్నారు.



## నిరుద్యోగులను నమ్మించి నయవంచన..

## రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 3:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని అన్నారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి యువత ఛీకొడుతోందని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీ అని చెప్పి... ఇప్పుడు ఐదేళ్ల హామీ అంటూ మాటమార్చారంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో మాజీ మంత్రి కేటీఆర్ పోస్టు చేశారు.

**కేటీఆర్ ట్వీట్..** - మిగతా3లో



## మేయర్ పదవి కోసం రూ. 8 కోట్ల చెల్లింపులు



**నిజామాబాద్, ఫిబ్రవరి 3:**తెలంగాణ రాష్ట్రంలో మున్సిపాలిటీలకు, నగర పాలకాలకు ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించబోతోంది. ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ మొదలైంది. ఆశావాహులు పోటీపడి నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి.. ఆ పార్టీ నుంచి పోటీ చేయడానికి చాలామంది ముందుకు వస్తున్నారు. ఒక్కో కౌన్సిలర్ స్థానానికి ఇద్దరు లేదా ముగ్గురు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీలో ఉన్నారు.అభ్యర్థుల నుంచి విపరీతమైన పోటీ ఉండడంతో కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఎవరికి టికెట్లు కేటాయించాలో తెలియక సతమతమవుతున్నారు. చైర్మన్లను ఇప్పటికే ప్రకటించకూడదని.. అన్ని స్థానాలలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలవాలని.. ఆ తర్వాతే సమీకరణాల ఆధారంగా చైర్మన్ పదవులు కేటాయించాలని రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. పలు ప్రాంతాలకు - మిగతా3లో

# హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుంది

**వికసిత్ భారత్ 2047 కోసం పెట్టిన బడ్జెట్ అన్న కిషన్ రెడ్డి**

**ఉచిత పథకాల కోసమే బడ్జెట్ అన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం**

**ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందన్న కిషన్ రెడ్డి**

హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2026-27 బడ్జెట్ ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం తీసుకువచ్చిన బడ్జెట్ అన్నారు. ఉచితాలు ప్రవేశపెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని అన్నారు. వీబీ జీ రామ్ జీ ద్వారా ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేశారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. ఈ పథకానికి బడ్జెట్‌లో 9 శాతం నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30 లక్షల ఇళ్లు కేటాయించామని, మేడారం జాతరకు కేంద్రం రూ.3.70 కోట్లు కేటాయించిందని అన్నారు. నైనీ బొగ్గు బొగ్గు గనుల వ్యవహారంలో తెలంగాణ మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ తన ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చుకుందని విమర్శించారు. - మిగతా3లో



## రెబల్స్‌కు జగ్గారెడ్డి గట్టి హెచ్చరిక



**పార్టీ నిర్ణయాన్ని కాదని బరిలో నిలిస్తే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరిక**

**సంగారెడ్డిలో ఎనిమిది వార్డుల్లో రెబల్స్ పోరు**

తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి.ఈ నేపథ్యంలో అన్ని పార్టీలకు కూడా రెబల్స్ బెడద తప్పడం లేదు. ఈ క్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ రెబల్స్ అభ్యర్థులకు హెచ్చరిక జారీ చేశారు. తనను, పార్టీ నిర్ణయాన్ని కాదని ఎవరైనా నామినేషన్ వేస్తే వారిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో అధికార కాంగ్రెస్ పార్టీకి ఎనిమిది వార్డుల్లో రెబల్స్ పోరు ఉంది. అయితే పార్టీ అధిష్ఠానం ఇప్పటికే అభ్యర్థులకు బీ-ఫామ్‌లు అందజేసింది. పోటీకి ఆసక్తి చూపుతున్న మిగిలిన అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకుని పార్టీ బీ-ఫామ్ ఇచ్చిన అభ్యర్థులకు సహకరించాలని జగ్గారెడ్డి సూచిస్తున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ తేలుతుందా...! ముంచుతుందా..?

**హైదరాబాద్, ఫిబ్రవరి 3:**తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతున్న కీలకమైన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కీలక దశకు చేరుకుంది. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ను ప్రత్యేక దర్యాప్తు బృందం నాలుగున్నర గంటలకు పైగా సుదీర్ఘంగా విచారించింది. హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమైన ఈ విచారణలో కేసీఆర్‌కు సిట్ అధికారులు పలు ప్రశ్నలు సంధించినట్లు సమాచారం.గతంలో సాక్షులిచ్చిన ఆధారాలు ముందు పెట్టి మాజీ సీఎం కేసీఆర్ ను సిట్ బృందం ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు దగ్గర నుంచి ఫోన్ ట్యాపింగ్ వరకూ అన్ని అంశాలపైనా ప్రశ్నలు వేసినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ ఆదేశాలు ఎవరి సూచనలతో జారీ అయ్యాయనే విషయంపై, నిర్ణయ ప్రక్రియలో కేసీఆర్ పాత్రపై సిట్ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.ఫోన్ ట్యాపింగ్ చేయమని ఆదేశాలు జారీ చేశారా..? అని కేసీఆర్‌ని సిట్ బృందం ప్రశ్నించినట్లు తెలుస్తోంది.'ఫోన్ ట్యాపింగ్ చేయమని ఇంటెలిజెన్స్ అధికారులకు మీరు స్వయంగా ఆదేశాలు జారీ చేశారా?' అనే ప్రశ్నను స్పష్టంగా అడిగినట్లు సమాచారం. ఈ అంశంపై కేసీఆర్ నుంచి క్లారిటీ తీసుకునేందుకు సిట్ అధికారులు తీవ్రంగా ప్రయత్నించినట్లు తెలిసింది. ఏ



సంవత్సరం నుంచి ఫోన్ ట్యాపింగ్ మొదలైంది..? అనే విషయాలపై సిట్ అధికారులు ప్రత్యేకంగా ఆరా - మిగతా3లో

## రెబల్స్...బుజ్జగింపులు...

**అదిలాబాద్, ఫిబ్రవరి 3:**ఆయా పార్టీల నుంచి బరిలో నిలిచేందుకు బీ ఫారంలు అందజేసేందుకు ఈ నెల మూడవ తేదీ ఆఖరు కాగా, అభ్యర్థి నామినేషన్ విత్ డ్రా చేసుకునేందుకు మద్యాహ్నం మూడు గంటల వరకే సమయం ఉండటంతో రెబల్స్ తో ఇబ్బందులు పడుతున్నవారంతా ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మంచిర్యాల కార్పొరేషన్ తో పాటు లక్షెట్టిపేట మున్సిపాలిటీల కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లను వెల్లడించగా, బెల్లంపల్లి మున్సిపాలిటీతో పాటు చెన్నూర్, క్యాతనపల్లి మున్సిపాలిటీల అభ్యర్థులను ఆయా నియోజక వర్గ ఎంఎల్ఏలు ఇంత వరకు ప్రకటించలేదు. అలాగే బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు సైతం అభ్యర్థుల పేర్లు అన్నింటిలో పూర్తి స్థాయిలో ప్రకటించాల్సి ఉంది.అయితే పార్టీ బీ ఫారంలు సమర్పించిన అనంతరం ఎంత మంది పార్టీ నుంచి బరిలో ఉంటారు, ఎంత మంది విత్ డ్రా చేసుకుంటారో, ఇండిపెండెంట్లుగా బరిలో ఎందరు నిలుస్తారో తేలనుంది. అయితే అభ్యర్థులను విత్ డ్రా చేయించి తమకు మద్దతు తెలుపాలని, ఇందు కోసం లక్షల్లో మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. అయితే ఈ సారి బరిలో లేకుంటే తర్వాత తమకు అవకాశం రావడం కలేనని, ఏదీ ఏమైనా బరిలో నిలుచునుడే.., సామర్థ్యం పరీక్షించుకునేడే అనే ధోరణితో రెబల్స్ ఉన్నట్లు సమాచారం. ఏది ఏమైనా మధ్యవర్తిత్వం ఫలిస్తుందా..! విఫలమవుతుందా..!




అనేది వేచి చూడాల్సిందే...జిల్లాలో 149 డివిజన్, వార్డులకు 1061 మంది అభ్యర్థులకు చెందిన 1177 నామినేషన్లు ఆమోదం పొందగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల - మిగతా3లో

# సంపాదకీయం

## విబి జి రామ్ జితో భారత్ వికసించేనా?

ప్రభుత్వాలు మారినప్పుడల్లా నాటి పాలకుల విధానాలను, సంక్షేమ పథకాలను, వాటి పేర్లను మార్చడం పాలకుల రాజకీయ ఎత్తుగడలో భాగం, సహజం కూడా. అయితే మార్పు అనేది పాలకుల సర్వతోముఖాభివృద్ధికి కాకుండా ప్రజలకు కనీస జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా ఉండాలి. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత పాలకులు రూపొందించిన అభివృద్ధి విధానాలను, సంక్షేమ పథకాలను లోప భూయిష్టమైనవిగా పేర్కొంటూ వాటిని ఆపివేయడం సర్వసాధారణమైన ప్రక్రియగా మారింది. గత ప్రభుత్వాలు ప్రారంభించి, పూర్తి కాని అభివృద్ధి పథకాల (నీటిపారుదల ప్రాజెక్టులు, విద్య, వైద్య తదితర రంగాల పనుల)ను యథాతథంగా కొనసాగిస్తే ఆ పేరుప్రతిష్ఠలు గత ప్రభుత్వానికి దక్కుతాయేమోననే అక్కసుతోనే నిలుపుదల చేయడం మూలంగా లక్షలాది కోట్ల ప్రజాధనం వృథా అవుతుంది. 2005 లో అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం గ్రామాల నుండి పట్టణాలకి వలసలని నివారించడం, పేదరికాన్ని తగ్గించడం, మహిళా సాధికారతను సాధించడం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి ప్రధాన లక్ష్యాలతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (కరువు పని, 100 రోజుల పని) చట్టం 2005ను ప్రముఖ ఆర్థికవేత్తలు, మేధావులు, పార్లమెంటు సభ్యులు, వివిధ కమిటీలతో అనేక మార్లు సమావేశాలు నిర్వహించి వారి సూచనలను, సలహాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే ఎంజిఎన్ఎఆర్ఇజిఎ చట్టరూపం దాల్చి రెండు దశాబ్దాలుగా (కొన్ని లోపాలు ఉన్నప్పటికీ) నిర్దేశించుకున్న లక్ష్యాల వైపు అడుగులు ముందుకు వేస్తున్నది. ఈ పథకం చట్ట రూపంలో ఉన్న కారణంగా ఉపాధి కూలీలకు అన్యాయం జరిగితే చట్టపరంగా న్యాయాన్ని పొందే అవకాశం, ఉపాధి (పని)ని హక్కుగా డిమాండ్ చేసే అవకాశం ఉండడం ఉపాధి కూలీలకు ప్రధాన బలాలైతే ప్రభుత్వం ఈ పథకాన్ని నిరాటంకంగా కొనసాగించడానికి చట్టం రూపంలో హామీ పడి ఉంది. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం 2025 లో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (విబి జి రామ్ జి) మిషన్‌ను వికసిత్ భారత్ 2047 లక్ష్యాలలో భాగంగా తీసుకొచ్చామని చెబుతూనే గత ఉపాధి హామీ పథకంలో అనేక లోపాలున్న కారణంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఎంజిఎన్ఎఆర్ఇజిఎ 2005 చట్టం తూచా తప్పకుండా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఉపాధి హామీని నిరాటంకంగా కొనసాగించాలి అని చెబుతోంది. కానీ విబి జి రామ్ జి 2025 మిషన్ అనేది ప్రభుత్వ ఇచ్ఛ ఉన్నంత వరకే కొనసాగుతుంది. వీటి మధ్యనున్న ఈ వ్యత్యాసాన్ని గమనించకపోతే రాబోయే రోజుల్లో ఉపాధి హామీ అనేది 'హక్కు'గా ఉండకుండా పోయే ప్రమాదముంది. నూతన పథకంలో '25 రోజుల పని దినాలను అదనంగా పెంచడం' జియో టాగింగ్ ఆధారంగా వేతనాల చెల్లింపులు తప్ప విబి జి రామ్ జి 2025 లక్ష్యాల్లో చెప్పుకోదగ్గ మార్పులేవీ లేవు. నూతన ఉపాధి పథకానికి కేటాయించే బడ్జెట్‌లో కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 10% వాటాను భరించాల్సి ఉంటుంది. గత ఉపాధి హామీ పథకానికి కేంద్రం కేటాయించిన బడ్జెట్‌లో కూలీలు, సిబ్బంది వేతనాలకు 100%, సామాగ్రి కొనుగోళ్లకు వాటా 90%, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వాటా 10శాతం వాటాలు మాత్రమే భరించాయి. ప్రస్తుతం దేశంలోని చాలా రాష్ట్రాలు ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్న సంక్షేమ పథకాలు కొనసాగించలేని పరిస్థితి ఉన్నది. దానికి తోడు నూతన ఉపాధి పథకంలో రాష్ట్రాల నెత్తిన మోపిన భారం కారణంగా ఒకవేళ ఆయా రాష్ట్రాలు ఆసక్తి చూపకపోయినా, రాష్ట్రాల్లో తమకు అనుకూలమైన ప్రభుత్వాలు లేకపోయినా సదరు రాష్ట్రాలు వాటా ఇవ్వలేదనే నెపంతో ఆయా రాష్ట్రాలపై వ్యతిరేకతను కూడగట్టి తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని అధికారంలోకి వచ్చే విధంగా కుట్రలు చేయడం వలన పథకం లక్ష్యాలు నెరవేరకుండా ఉపాధి హామీ పథకం నిర్వీర్యమయ్యే అవకాశం ఉంది. నూతన పథకంలో రెండవ ప్రధానమైన అంశం వర్షాకాలంలో వ్యవసాయ రంగంలో కూలీల కొరత ఏర్పడుతుందనే కారణంతో 60 రోజుల పాటు ఉపాధి పథకాన్ని నిలిపివేయడం. దీని కారణంగా వ్యవసాయ కూలీల డిమాండ్ తగ్గి తక్కువ వేతనానికే పనికి వెళ్లాల్సి వస్తుంది. వ్యవసాయ పనులకు పోలేనటువంటి వారి జీవనోపాధి దెబ్బ తింటుంది. ఎనభై శాతం యాంత్రీకరణ జరిగిన వ్యవసాయ రంగంలో రెండు నెలల పాటు ఉపాధి పనులు నిలిపివేయడం ఉపాధి నిరోధక చర్యే అవుతుంది. నూతన ఉపాధి పథకంలో కేంద్ర నిర్ణయమే శిరోధార్యంగా ఉండే అవకాశం ఉంది. ఒకవేళ అదే జరిగితే నూతన ఉపాధి పథకం ఏ రాష్ట్రంలో జరగాలి, ఎటువంటి పనులు చేయాలనేది కేంద్రం ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. అప్పుడు రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గడమే కాక వికేంద్రీకరణ ఆదర్శం దెబ్బతిని రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చెలాయించే ప్రమాదముంది. బాధ్యత, జవాబుదారీతనం పేరుతో రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపడం వలన ఉపాధి హామీ అసలు లక్ష్యం నెరవేరకుండా క్రమంగా పథకం ఉనికిని కోల్పోయే ప్రమాదముంది. ఏ పథకమైనా విజయవంతం కావాలంటే పాలకుల్లో దృఢ సంకల్పం, నిరంతర పర్యవేక్షణ, అధికారుల్లో చిత్తశుద్ధి ఉండాలి. అప్పుడే ఉపాధి పథక లక్ష్యాలైన స్థానిక సంస్థలు బలపడడం, ఉత్పాదక ఆస్తుల సృష్టి, ఆర్థిక అసమానతల తగ్గుదల, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ కొంత మేరకైనా సఫలీకృతమై సామాజిక, ఆర్థిక అంతరాల గోడల్ని బద్దలు కొట్టగలం. పాలకులు కూడా దేశాన్ని పట్టిపీడిస్తున్న పేదరికం, నిరుద్యోగం, డ్రగ్స్, ఉగ్రవాదం, అవినీతిలను ప్రధాన శత్రువులుగా భావించినప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుంది.

# ట్రంప్ అభిశంసన...?

**న్యూయార్క్, ఫిబ్రవరి 3:** అగ్రరాజ్యం అమెరికాలో ఆ దేశ అధ్యక్షుడిపై ప్రజల్లో రోజురోజుకు వ్యతిరేకత పెరుగుతోంది. ఏడాదిలోనే ట్రంప్ గ్రాఫ్ గతంలో ఎరికీ లేనంతగా పడిపోయింది. మరోవైపు న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో ట్రంప్ బలపర్చిన అభ్యర్థి ఓడిపోయారు. ఇక ట్రంప్ పాలనలో ఇప్పటికే నెలరోజులు షట్‌డౌన్ అయిన అమెరికా మరోమారు అదే ప్రమాదం అంచున ఉంది. ఈ నేపథ్యలో అమెరికా ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు డొనాల్డ్ ట్రంప్‌పై మరో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. మార్చి 31 లోపు దీన్ని సాధించాలని ప్రణాళిక రూపొందించారు. అల్ గ్రీన్ వంటి నేతలు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.రెండో మారు అధికారంలోకి వచ్చిన ట్రంప్ చర్యలు, తీసుకుంటున్న నిర్ణయాలు, రూపొందిస్తున్న చట్టాలు ఏవీ ప్రజామోదయోగ్యంగా ఉండడం లేదు. అక్రమ వలసదారులపై దళాలు, మిన్నెసోటా కాల్పుల ఘటనలు హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వైఫల్యాన్ని హైలైట్ చేశాయి. సుంకాల వల్ల ధరల ఆకాశంగమనం చిన్న వ్యాపారాలు, పౌరుల్లో అసంతృప్తి పెంచింది. మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికైయ్యేందుకు ట్రంప్ ప్లాన్ చేస్తున్నారని, రాజ్యాంగం సవరించే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలు



ఉన్నాయి.రిపబ్లికన్ ఆధిపత్య సభలో డెమోక్రాట్లు మెజారిటీ లేకపోవడంతో, పార్టీలోని ట్రంప్ వ్యతిరేకుల మద్దతు కోరుతున్నారు. ట్రంప్ చర్యలు స్వంత పార్టీలో కూడా అసహనాన్ని రేకెత్తిస్తోంది. దీంతో అభిశంసనకు రిపబ్లికన్ సభ్యులు మద్దతు ఇస్తారని భావిస్తున్నారు. ఈ అభిశంసనను 2026 మధ్యంతర ఎన్నికలకు ఆయుధంగా ఉపయోగిస్తున్నారు. ట్రంప్ అధికారంతో ఎన్నికలపై ప్రభావం చూపించకుండా ఆపాలని భావిస్తున్నారు. మరోవైపు ట్రంప్ తన సపోర్టర్లను అప్రమత్తం చేస్తూ, మెజారిటీ కోల్పోతే ప్రతీకార చర్యలు తీసుకుంటారిని భావిస్తున్నారు.ప్రతినిధుల సభలో తీర్మానం ఆమోదమైనా, సెనెట్‌లో రిపబ్లికన్ బలంతో ట్రంప్ పదవి కోల్పోయే అవకాశం తక్కువ. అయితే, ఈ రాజకీయ రచ్చ ట్రంప్ ఇమేజ్‌ను దెబ్బతీస్తుంది. లేదా పార్టీలో చీలిక తెస్తుంది. మార్చి 31 డెడ్‌లైన్ ఒత్తిడి పెంచే ఎత్తుగడగానే కనిపిస్తోంది

# 41 శాతానికి పెరిగిన స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** ఫిబ్రవరి 1, 2026న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో 16వ ఆర్థిక కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం అధికారికంగా ఆమోదించింది. డాక్టర్ అరవింద్ పనగారియా నేతృత్వంలోని ఈ కమిషన్, 2026–31 కాలానికి గాను కేంద్ర పన్నుల నుంచి రాష్ట్రాలకు ఇచ్చే వాటాను, నిధుల పంపిణీకి సంబంధించిన కీలక నిర్ణయాలను వెల్లడించింది.16వ ఆర్థిక కమిషన్ రాష్ట్రాల వాటాను 41% వద్దే కొనసాగించాలని సిఫార్సు చేసింది. ఇది 15వ ఆర్థిక కమిషన్ నిర్ణయించిన వాటాకు సమానం. అనేక రాష్ట్రాలు తమ వాటాను 50%కి పెంచాలని కోరినప్పటికీ, కేంద్రం వద్ద ఉన్న ఆర్థిక వనరుల లభ్యతను దృష్టిలో ఉంచుకుని కమిషన్ పాత శాతాన్నే కొనసాగించింది.ఒక రాష్ట్రానికి ఎంత వాటా రావాలి అనేది నిర్ణయించడానికి ఈసారి కమిషన్ ఒక సరికొత్త అంశాన్ని చేర్చింది. అదే "రాష్ట్రం యొక్క జీడీపీ సహకారం". దీనివల్ల ఆర్థికంగా మెరుగ్గా రాణిస్తున్న రాష్ట్రాలకు ప్రయోజనం కలుగనుంది.కొత్తగా చేర్చిన జీడీపీ సహకారం మరియు ఇతర నిబంధనల వల్ల దక్షిణాది రాష్ట్రాలకు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ వంటి రాష్ట్రాలకు గతంలో కంటే కొంత మెరుగైన ప్రయోజనం కలిగే అవకాశం ఉంది.16వ ఆర్థిక కమిషన్ సిఫార్సులు "పనితీరుకు గుర్తింపు" ఇచ్చేలా ఉన్నాయి. కేవలం జనాభా లేదా వెనుకబాటుతనం మాత్రమే కాకుండా, దేశ అభివృద్ధికి రాష్ట్రాలు ఇచ్చే ఆర్థిక సహకారాన్ని కూడా ప్రాతిపదికగా తీసుకోవడం ఒక చారిత్రక మార్పు.

# నేడు ముఖ్దూం మొహియుద్దీన్ జయంతి

## తెలంగాణ సాయుధ పోరాట వీరుడు, కార్మిక నాయకుడు, ఉర్దూ కవి ముఖ్దూం మొహియుద్దీన్

తెలంగాణ సాయుధ పోరాట వీరుడు, కార్మిక నాయకుడు, ఉర్దూ కవి ముఖ్దూం మొహియుద్దీన్.. ఆయన 1908 ఫిబ్రవరి 4న మెదక్, హైదరాబాద్ స్టేట్ లో ఆయన జన్మించారు. బతకడానికి పెయింటింగ్స్, సినిమా తారల ఫొటోలు అమ్మాడు. ట్యూషన్లు చెప్పాడు, పత్రికల్లో పనిచేశాడు. ఆయన రాసిన 'గోథే ప్రేమ లేఖలు' 'మక్తబా' అనే స్థానిక ఉర్దూ పత్రిక అచ్చేసింది. ఉస్మానియా యూనివర్సిటీలో మఖ్దూమ్ (1934–37) హాస్టల్‌లో ఉండేవాడు. అక్కడ తన తొలి కవిత 'టూర్' 1934లో రచించాడు. మఖ్దూమ్, కవి గా, నాటక రచయితగా, నటుడిగా ప్రసిద్ధుడయ్యాడు. 1934లో బెర్నార్డ్ షా నాటకానికి 'హోష్ కె నా ఖూన్' అనే ఉర్దూ అనుసరణ రాసి హైద్రాబాద్‌లో రవీంద్రనాథ్ ఠాగూర్ సమక్షంలో ప్రదర్శించాడు. గురుదేవులు ఆ నాటకం చూసి ఆనందం పట్టలేక, నాటక ప్రదర్శన అయిపోగానే స్టేజిపైకి వెళ్ళి మఖ్దూమ్‌ని అభినందించి, తన శాంతినికేతన్‌కు వచ్చి చదువుకోవాల్సిందిగా ఆహ్వానించాడు. మఖ్దూమ్ 'మర్షదే కామిల్' అనే మరో నాటకం రాశాడు. 1937లో మఖ్దూమ్ తన 29వ యేట ఎం.ఎ. డిగ్రీ తీసుకున్నాడు. 'ఉర్దూ నాటకం'పై ఒక పరిశోధన పత్రం కూడా రాశాడు. హైకోర్టు పక్కన గల సిటీ కాలేజీలో అధ్యాపకుడిగా ఉద్యోగం దొరికింది. కమ్యూనిస్టు రహస్య పత్రిక 'నేషనల్ ఫ్రంట్' సంపాదించి చదివేవాడు. 1930–40లలో హైద్రాబాద్‌లో 'స్టూడెంట్స్ యూనియన్' ప్రారంభించాడు. 1940లో తన సహచరులతో కలిసి కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. చంద్ర రాజేశ్వరరావు, గులాం హైదర్, రాజ బహదూర్ గౌర్, హమీదలీ ఖాద్రీ లాంటి నాయకులతో కలిసి పనిచేస్తుండేవాడు."రైతుకు రొట్టె నివ్వని పొలమెందుకు, కాల్చేయండి ప్రతి గోధుమ కంకిని!" అనే ఇక్బాల్ కవితను నినదించేవాడు. అక్తర్ హుస్సేన్ రాయ్‌పురి, సిబ్తె హసన్‌లతో కలిసి హైద్రాబాద్‌లో 'అభ్యుదయ రచయితల సంఘం' స్థాపించాడు. సరోజినీ నాయుడు నివాసమైన గోల్డెన్ త్రెషోల్డ్లో డాక్టర్ జయసూర్య, జె.వి.నరసింగరావులతో కలిసి సాహిత్య, సామాజిక, రాజకీయ అంశాలపై చర్చలు జరుపుతుండేవాడు. చార్మినార్ సిగట్ ఫ్యాక్టరీ, బట్టల గిర్నీ, అల్విన్, షాబాద్ సిమెంట్, ఎన్ ఎస్సార్ రైల్వే ఎంప్లాయిస్, ఎలక్ట్రిసిటీ, సి.డబ్ల్యు.డి. మున్సిపాలిటీ, బటన్ ఫ్యాక్టరీ వంటి వందల కంపెనీల్లోని కార్మిక సంఘాలకు మఖ్దూమ్ అధ్యక్షుడయ్యాడు. అహో రాత్రులు వారి సంక్షేమం కోసం కృషి చేశాడు. స్టేట్ అసెంబ్లీలో మాట్లాడినా, బయట కార్మిక సంఘాలలో మాట్లాడినా ఆయన వాగ్ధాటికి ఎదురుండేది కాదు. విషయం సూటిగా, స్పష్టంగా, దృఢంగా, బలంగా చెప్పేవాడు. నల్లగొండ జిల్లా హుజూర్ నగర్ నుండి శాసనసభకు ఎన్నికయ్యాడు. 1957లో మెదక్ నుండి పార్లమెంట్‌కు పోటీ చేసి ఓడిపోయాడు. శాసనమండలికి ఎన్నికై 1969లో కన్నుమూసే దాకా కమ్యూనిస్టు నేతగా ఆ పదవిలో కొనసాగాడు.మఖ్దూం కార్మిక నాయకుడు, శాసన మండలి సభ్యుడు.



ఫాసిజానికి వ్యతిరేకంగా సమసమాజ స్థాపనకోసం క్రియాశీలంగా రాజకీయాల్లో పాల్గొన్నాడు. అందరూ కలిసి భోజనం చేసే దస్తర్‌ఖాన్ల గురించి కల గన్నాడు. ప్రగతిశీల భావాలతో పీడితుల పక్షాన కలమెత్తి నమ్మిన సిద్ధాంతానికి జీవితాన్నంకితం చేసి అమరుడైనాడు. కమ్యూనిస్టు అయిన మఖ్దూం. మతాన్ని దూషించలేదు అనుసరించలేదు. హైద్రాబాద్ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ శాఖకు తొలి కార్యదర్శి. నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన ప్రపంచ ప్రసిద్ధ తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్య పాత్రధారి. సాయుధ పోరాటానికి ముందు కారాగార శిక్షలు, పోరాటం తర్వాత అజ్ఞాత వాసం.హైద్రాబాద్ రాష్ట్ర శాసనసభ్యుడు (1952) శాసనమండలి సభ్యుడు, ప్రతిపక్ష నేత (1956–1969), భారత కార్మిక వర్గ విప్లవ చరివూతలో ముఖ్య పాత్రధారి. ఎఐటియుసికి జాయింట్ సెక్రటరీ.నిజాముకు వ్యతిరేకంగా తెలంగాణా సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించాడు. ఢిల్లీలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ సమాఖ్య (ఎ.ఐ.టి.యు.సి.) జాయింట్ సెక్రటరీగా కొంత కాలం ఢిల్లీలో ఉన్నాడు.1952–55 మధ్య చైనా, సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాలు, ఆఫ్రికన్ దేశాలు తిరిగి వచ్చాడు. ప్రపంచ ట్రేడ్ యూనియన్ సమాఖ్య ప్రధాన కార్యాలయం వియాన్నాలో (1953–54) పనిచేశాడు.1969, ఆగష్టు 25 తేదీన గుండెపోటుతో ఢిల్లీలో చనిపోయాడు. ఆయన పేరిట హైద్రాబాద్, హిమాయత్‌నగర్‌లో సి.పి.ఐ. రాష్ట్ర కార్యాలయం మఖ్దూమ్ భవన్ నిర్మించారు.

# ఎట్టకేలకు ట్రేడ్ డీల్...

## 18 శాతానికి తగ్గనున్న టారిఫ్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిందని అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ ప్రకటించారు. మరోవైపు భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాన్ని అమెరికా 18 శాతానికి తగ్గించిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు.అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ ఇరువురూ ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు.అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిందని, భారతీయ దిగుమతులపై అమెరికా సుంకాన్ని 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నామని అధ్యక్షుడు ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు."భారతదేశంలో తయారైన ఉత్పత్తులపై అమెరికాలో విధించే సుంకాలు ఇకపై 18 శాతానికి తగ్గనున్నాయని తెలిసి నాకు సంతోషంగా ఉంది" అని ప్రధాని మోదీ అన్నారు."ప్రధాని మోదీపై అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తోంది" అని ఈ ప్రకటన తర్వాత ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. చాలాసార్లు చెప్పినట్లుగా, అధ్యక్షుడు ట్రంప్ నిజంగా ప్రధానమంత్రి మోదీని చాలా మంచి స్నేహితుడిగా భావిస్తారు వాణిజ్య ఒప్పందం వార్తలతో నాకు చాల సంతోషంగా ఉంది. అమెరికా–భారతదేశం సంబంధం అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది" భారతదేశంలో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఇన్‌స్టాగ్రామ్‌లో రాత్రి పోస్ట్ చేశారు.దాదాపు ఏడాదికాలంగా రెండు దేశాల మధ్య సంబంధాలలో అనేక ఒడిదుడుకులు ఎదురవుతున్న నేపథ్యంలో సోమవారం రాత్రి రెండు దేశాల అగ్ర నాయకులు చేసిన ఈ ప్రకటన చాలా కీలకంగా మారింది.మొదట విధించిన సుంకాలతో పాటు, రష్యా నుంచి భారత్ చేసే చమురు కొనుగోళ్లపై అమెరికా 25 శాతం సుంకం విధించడంతో మొత్తం 50 శాతానికి చేరుకుంది. భారత ప్రధాని మోదీతో మాట్లాడటం గౌరవంగా ఉంది. ఆయన నా ప్రాణ స్నేహితులలో ఒకరు. తన దేశంలో శక్తివంతమైన, గౌరవనీయమైన నాయకుడు. వాణిజ్యం, రష్యా–యుక్రెయిన్ యుద్ధాన్ని ముగించడం వంటి అనేక అంశాలపై మేము చర్చించాం. రష్యా చమురు కొనుగోలును ఆపివేసి, అమెరికా నుంచి, బహుశా వెనెజ్వెలా నుంచి మరింత చమురు కొనుగోలు చేయడానికి ఆయన అంగీకరించారు"ఇది యుక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధాన్ని ముగించడంలో సహాయపడుతుంది,



ఈ యుద్ధం ప్రతివారం వేలమందిని చంపుతోంది. ప్రధానమంత్రి మోదీ పట్ల స్నేహం, గౌరవం కారణంగా, ఆయన విజ్ఞప్తి మేరకు, అమెరికా, భారతదేశం మధ్య తక్షణమే అమలులోకి వచ్చే వాణిజ్య ఒప్పందానికి మేము అంగీకరించాం. దీని కింద భారతీయ వస్తువులపై సుంకాన్ని 25 శాతం నుంచి 18 శాతానికి అమెరికా తగ్గించింది"భారత్ కూడా అమెరికాతో తన సుంకాలు, నాన్–టారిఫ్ అడ్డంకులను జీరో చేసే దిశగా ముందుకు సాగుతుంది. "బై అమెరికన్" విధానం కింద అమెరికా నుంచి మరిన్ని కొనుగోళ్లు చేయడానికి ప్రధానమంత్రి మోదీ తన నిబద్ధతను వ్యక్తం చేశారు. ఇందులో 500 బిలియన్ డాలర్లకు పైగా విలువైన అమెరికా ఇంధనం, సాంకేతికత, వ్యవసాయం, బొగ్గు, అనేక ఇతర ఉత్పత్తులు ఉంటాయి""ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసి పనిచేసినప్పుడు, అది మన ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుంది. పరస్పర ప్రయోజనం కోసం అపారమైన అవకాశాలను అందిస్తుంది""ప్రపంచ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం అధ్యక్షుడు ట్రంప్ నాయకత్వం చాలా కీలకం. శాంతి కోసం ఆయన చేసే ప్రయత్నాలలో భారత్ ఆయనకు గట్టి అండగా నిలుస్తుంది. మా భాగస్వామ్యాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడానికి ఆయనతో కలిసి పనిచేయడానికి నేను ఎదురు చూస్తున్నాను" అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ తేలుతుందా...!ముంచుతుందా..?

- మొదటి పేజీ తరువాయి

తీశారు.'ఏ సంవత్సరం నుంచి ఫోన్ ట్యాపింగ్ చేయమని చెప్పారు?, అది సాధారణ భద్రత కోసమా..? లేక రాజకీయ అవసరాల కోసమా..?' అంటూ పలు ప్రశ్నలు వేసినట్లు సమాచారం. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేశారా..?.. వారి ఫోన్లు ట్యాప్ చేయమని ఆదేశాలు ఇచ్చారా..? అంటూ సిట్ అధికారులు నేరుగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ ప్రశ్నలపై కేసీఆర్ ఇచ్చిన సమాధానాలు ఈ కేసులో తమ దర్యాప్తునకు కీలకంగా మారనున్నాయని సిట్ అధికారులు భావిస్తున్నారు.ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు వ్యవహారం కూడా సిట్ అధికారుల విచారణలో ప్రధాన అంశంగా మారింది. పదవీకాలం ముగిసిన ప్రభాకర్‌రావుకు మళ్లీ పదవిని ఎందుకు పొడిగించారు..? ఆ నిర్ణయం వెనుక కారణాలు ఏంటి..? అంటూ కేసీఆర్‌ను సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఒకే వ్యక్తికి రెండు కీలక పోస్టులు ఎందుకు..?పరిపాలనా నియమావళికి విరుద్ధంగా ఒకే వ్యక్తికి రెండు కీలక బాధ్యతలు అప్పగించడంపై కూడా సిట్ అధికారులు ప్రశ్నలు సంధించారు. ఒకే వ్యక్తికి రెండు కీలక పోస్టులు ఎందుకు అప్పగించారు..?, అది ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో సంబంధం ఉందా..? అనే కోణంలో సిట్ విచారణ కొనసాగినట్లు సమాచారం.ఎమ్మెల్యేల కొనుగోలు కేసు సమయంలో తీసుకున్న చర్యలపై కూడా సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. 'మీ పార్టీ ఎమ్మెల్యేలు ఇతర పార్టీలకు వెళ్తున్నారని మీకు ఎలా తెలిసింది?, ఆ సమాచారం ఫోన్ ట్యాపింగ్ ద్వారానే వచ్చిందా..? అనే అనుమానాలతో అధికారులు ఆరా తీసినట్లు తెలుస్తోంది. పార్టీ ఫండ్‌తో ఫోన్ ట్యాపింగ్



పరికరాల కొనుగోలు..? చేశారా అని సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఈ విచారణలో మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. ఫోన్ ట్యాపింగ్ పరికరాల కొనుగోలుకు పార్టీ ఫండ్‌ను కేటాయించారా..? ప్రభుత్వ నిధులు కాకుండా పార్టీ డబ్బులు ఎందుకు ఉపయోగించారు..? అంటూ సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఇంకెన్నాళ్లు...ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును టీవీ సీరియల్ లాగా సాగదీస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. ఢిల్లీలోని తన నివాసంలో మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. దర్యాప్తు మొదలై ఇప్పటికే రెండేళ్లకు పైగా అవుతోందన్నారు. కేసీఆర్ కుమార్తె కవితనే తన భర్త ఫోన్ ట్యాప్ అయిందని ఆరోపించారని గుర్తుచేశారు. హైకోర్టు జడ్జిల ఫోన్లు ట్యాప్ అయ్యాయంటూ రాష్ట్ర పోలీసులు హైకోర్టులో అఫిడవిట్ వేశారని, ఇంకెన్నేళ్లు దర్యాప్తు చేస్తారని ప్రశ్నించారు. ట్యాపింగ్ ఎవరు చేసినప్పటికీ ప్రభుత్వం ద్వారా జరిగిందనేది వాస్తవమని, అందరి ఫోన్లూ ట్యాప్ అయ్యాయని చెప్పారు. ట్యాపింగ్ తీవ్రమైన నేరారోపణ ఉన్న కేసు అని, ఈ ఘటనలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు.కాంగ్రెస్ బీఆర్‌ఎస్‌లు అవినీతికి కొమ్ముకాస్తున్నాయని, ఆ పార్టీలపై ప్రజలకు విశ్వాసం లేదన్నారు. తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీలకు బుద్ధి చెబుతార పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబం ఆస్తుల వాటాల కోసం కొట్టుకుంటుంటే రేవంత్ సర్కారులో మంత్రులు కూడా రోడ్డున పడి డబ్బుల వాటాల కోసం కొట్లాడుకుంటున్నారని ఆరోపించారు. ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో తెలంగాణ సర్కారు ఉందని ఆయన అన్నారు.

# రెబల్స్...బుజ్జగింపులు...

- మొదటి పేజీ తరువాయి

నుంచి అధిక సంఖ్యలో ఆశాపడుతున్నట్లుంది. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లకు కాంగ్రెస్ నుంచి 77 నామినేషన్ లు, బీఆర్ఎస్ నుంచి 98, బీజేపీ నుంచి 108, బెల్లంపల్లి మున్సిపాలిటీ లోని 34 వార్డులకు కాంగ్రెస్ నుంచి 123, బీఆర్ఎస్ నుంచి 81, బీజేపీ నుంచి 27, చెన్నూర్ మున్సిపాలిటీ లోని 18 వార్డులకు కాంగ్రెస్ నుంచి 56, బీఆర్ఎస్ నుంచి 36, బీజేపీ నుంచి 24, క్యాతనపల్లి మున్సిపాలిటీ లోని 22 వార్డులకు కాంగ్రెస్ నుంచి 88, బీఆర్ఎస్ నుంచి 53, బీజేపీ నుంచి 33, లక్షెట్టిపేట మున్సిపాలిటీ లోని 15 వార్డులకు కాంగ్రెస్ నుంచి 25, బీఆర్ఎస్ నుంచి 32, బీజేపీ నుంచి 25 నామినేషన్లు వచ్చాయి. ప్రతీ పార్టీ నుంచి డివిజన్ లు, వార్డులకంటే నామినేషన్లు అధికంగా ఉండటంతో ఎవరికి బీ ఫాం వస్తుంది, ఎంత మంది విత్ డ్రా అవుతారు, ఇండిపెండెంట్లుగా ఎంత మంది బరిలో నిలుస్తారోననే ఉత్కంఠ నెలకొంది. డబ్బులే సర్వే ప్రజాదరణ ఉన్న... గెలిసే సత్తా చూపిన... సరిపడ సొమ్ము ఉంటేనే బి ఫారం అనే ప్రచారం జిల్లాలో జోరుగా సాగుతోంది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు, ఇల్లందు, అశ్వరావుపేట మున్సిపాలిటీలలో ఎన్నికలవేళ రాజకీయ వాతావరణం హీటెక్కుతోంది. ప్రధాన రాజకీయ పార్టీల నుంచి పోటీ చేయాలనుకున్న ఆశావాహులకు సర్వేభయం పట్టుకుంది.క్షేత్రస్థాయిలో ప్రజల మన్ననలు ఉన్నప్పటికీ సరిపడ నిధులు సమకూర్చ గల వారికే బి ఫారాలు దక్కుతాయని ప్రచారంతో ఆశావాహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పార్టీని అంటిపెట్టుకొని ప్రజా సమస్యలతో నిత్యం ప్రజల మధ్య ఉన్నప్పటికీ డబ్బులు లేకపోవడంతో అభ్యర్థులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలకు జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో మేయర్, చైర్మన్ పదవులకు డిమాండ్ పెరిగింది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి దక్కించుకోవాలంటే రూ 10 నుంచి 15 కోట్లు, ఇల్లందు, అశ్వరావుపేట మున్సిపల్ చైర్మన్ పదవులకు రూ.2 నుంచి 3 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉండాలంటూ ప్రధాన ప్రార్టీలు చెబుతున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది.ఉన్నత పదవులే కాకుండా కార్పొరేటర్, కౌన్సిలర్ టిక్కెట్ల కోసం అభ్యర్థులు పెద్ద మొత్తంలో డిపాజిట్లను చూపాల్సి వస్తోంది. ఒక్కొక్క డివిజన్ నుంచి పోటీ చేయాలంటే రూ 25 నుంచి 35 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని నేతలు స్పష్టం చేస్తున్నారు. డబ్బులు లేని కార్యకర్తలకు టిక్కెట్లు దక్కే అవకాశం లేదంటున్నారు. రాజకీయ సిద్ధాంతాలతో సంబంధం లేకున్నా ఆర్థిక స్తోమత చాలినంత ఉంటే వారికే పార్టీలు పెద్దపీట వేయటం మాజీ ప్రజాప్రతినిధులకు మింగుడు పడటం లేదు.ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతి వార్డు, డివిజన్లో సర్వేలు నిర్వహించి గెలిచే అవకాశం ఉన్న అభ్యర్థుల్లో ఎవరికి ఎక్కువ ఆర్థిక బలం ఉంటుందో వారికే టిక్కెట్లు కేటాయించే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రస్తుత మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికలు బహు ఖరీదుగా మారాయి. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 60 డివిజన్లలో 592 మంది అభ్యర్థులు 807 నామినేషన్లు సమర్పించారు.నామినేషన్ల పరిశీలనలో 215 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయి. 592 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

# నిబంధనలు పాటించాల్సిందే

- మొదటి పేజీ తరువాయి

పేర్కొంది. 2024 నవంబరు 18న వాట్సాప్ నిర్వాహక కంపెనీ మెటాపై రూ.213.14 కోట్ల జరిమానాను కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) విధించింది. వాట్సాప్ యూజర్ల సమాచారాన్ని అడ్వర్టయిజ్‌మెంట్ కంపెనీలకు షేర్ చేసే ప్రక్రియపైనా ఐదేళ్ల నిషేధాన్ని విధించింది. "వాడితే వాడండి, లేదంటే వదిలేయండి" అన్నట్టుగా వాట్సాప్ ప్రైవసీ పాలసీ ఉందని సీసీఐ వ్యాఖ్యానించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వాట్సాప్, మెటా అప్పీల్ పిటిషన్లు దాఖలు చేశాయి. మంగళవారం వీటిపై విచారణ నిర్వహించే క్రమంలో సుప్రీంకోర్టు ధర్మాసనం తాజా వ్యాఖ్యలు చేసింది.భారత ప్రభుత్వ సంస్థ సీసీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, వాట్సాప్, మెటా కంపెనీల తరఫు న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, అఖిల్ సిబల్ వాదనలు వినిపించారు. నిలిపివేయండి (ఆప్ట్ ఔట్) అనే ప్రస్తావన తమ ప్రైవసీ పాలసీలో ఉందని, అలాంటప్పుడు యూజర్ల సమాచారాన్ని తాము వాణిజ్య ప్రకటనల సంస్థలకు బదిలీ చేయడంపై అభ్యంతరం ఎందుకని వాట్సాప్ తరఫు న్యాయవాదులు వాదించారు. ఆప్ట్ ఔట్ లాంటి ఆప్షన్ల గురించి తమలాంటి వాళ్లకే సరిగ్గా తెలియదని, ఎక్కడో బిహార్‌లోని మారుమూల పల్లెల్లో ఉండే భారతీయులకు ఎలా తెలుస్తుందని సుప్రీంకోర్టు బెంచ్ ప్రశ్నించింది. ప్రైవసీ పాలసీ మాటున భారతీయ వాట్సాప్ యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేస్తున్నారని మండిపడింది. ఇలా జరగకుండా అడ్డుకుంటామని ధర్మాసనం తేల్చి చెప్పింది.ఈక్రమంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తన వ్యక్తిగత అనుభవం ఒకటి చెప్పారు. "కొంతమంది వాట్సాప్ యూజర్లు, డాక్టర్లతో వాట్సాప్‌లో ప్రైవేట్ ఛాటింగ్ చేశారట. ఆ వెంటనే వాళ్లకు మెడిసిన్స్‌కు సంబంధించియాడ్స్ కనిపించడం మొదలైందట. ఈ లెక్కన యూజర్ల సమాచారాన్ని, ఆసక్తులను కూడా డబ్బుగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు" అని సీజేఐ పేర్కొన్నారు. వాట్సాప్ తరఫు న్యాయవాదులు స్పందిస్తూ, అన్ని వాట్సాప్ మెసేజ్‌లు ఎండ్ టుఎండ్ ఎన్‌క్రిప్టెడ్‌గా ఉంటాయన్నారు. స్వయంగా వాట్సాప్ కంపెనీ కూడా



వాటిని చూడలేదని స్పష్టం చేశారు.సీసీఐ తరఫు న్యాయవాది తుషార్ మెహతా జోక్యం చేసుకుంటూ, యూజర్ల సమాచారాన్ని అడ్వర్టయిజ్‌మెంట్ కంపెనీలకు షేర్ చేసే విషయంలో వాట్సాప్, మెటాలు దోపిడీదారు వైఖరితో అన్యాయంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. యూజర్ల నుంచి నిర్దిష్ట అనుమతిని పొందకుండానే వారి వ్యక్తిగత యాక్టివిటీలు, ఆసక్తుల సమాచారాన్ని సోషల్ మీడియా కంపెనీలు అమ్ముకోకుండా నిరోధించాలని తుషార్ మెహతా కోరారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం ప్రకారం సోషల్ మీడియా యూజర్ల మెటా డేటా భద్రత కోసం నిర్దిష్ట మార్గదర్శకాలను ఇవ్వాలని సుప్రీంకోర్టుకు విన్నవించారు.తుషార్ మెహతా వాదనతో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఏకీభవిస్తూ రాజ్యాంగాన్ని పాటించలేకపోతే, దేశం విడిచి వెళ్లిపోవాలని వాట్సాప్, మెటాలను హెచ్చరించారు. ఈ లిటిగేషన్‌లో భారత ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను కూడా ఒక పక్షంగా చేరుస్తున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియా యూజర్ల మెటా డేటా భద్రతపై తగిన సూచనలను తమకు సమర్పించాలని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను సీజేఐ ఆదేశించారు.ఈ అంశంపై వాదనలు ముగిసే వరకు యూజర్లకు సంబంధించిన ఏ సమాచారాన్నీ మెటా కంపెనీకి ఇవ్వొద్దని వాట్సాప్‌కు సుప్రీంకోర్టు బెంచ్ ఆర్డర్ ఇచ్చింది. సోషల్ మీడియా కంపెనీల వాణిజ్య వ్యవహారాల వల్ల భారత పౌరుల ప్రాథమిక గోప్యతా హక్కుకు భంగం కలగరాదని తేల్చి చెప్పింది. డేటా షేరింగ్ పేరుతో భారత పౌరుల ప్రైవసీ హక్కుతో ఆటలు ఆడటం సరికాదని పేర్కొంది. అన్యాయంగా వాట్సాప్ యూజర్ల సమాచారాన్ని ఇతరులకు షేర్ చేసేందుకు టెక్ కంపెనీలకు అనుమతి ఇచ్చేది లేదని దేశ సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. టెక్ దిగ్గజ కంపెనీల ప్రైవసీ షరతులు, నిబంధనలకు చాలా తెలివిగా రూపకల్పన చేశారని మండిపడింది. ఈ అంశంపై మళ్లీ ఫిబ్రవరి 9న వాదనలు వింటామని, ఆ రోజునే మధ్యంతర ఆదేశాలను జారీ చేస్తామని ధర్మాసనం పేర్కొంది.

# లోక్‌సభలో చైనా అంశంపై రచ్చ...

## స్పీకర్ టేబుల్ ఎక్కిన కాంగ్రెస్ ఎంపీలు - వాయిదా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండో రోజు మంగళవారం లోక్‌సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చైనా సరిహద్దు వివాదాన్ని మరోసారి ప్రస్తావించడంతో సభలో ఒక్కసారిగా ఉద్రిక్తత ప్రారంభమయింది. మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం. నరవాణే రాసినట్లుగా చెబుతున్న ప్రచురించని పుస్తకంలోని అంశాలను రాహుల్ ప్రస్తావించడాన్ని బీజేపీ ఎంపీలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరుపక్షాల మధ్య వాగ్వాదం జరగడంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా వేశారు. కాంగ్రెస్ సభ్యులు స్పీకర్ ముందు ఉన్న టేబుల్ ఎక్కిన నిరసన వ్యక్తం చేశారు. రాహుల్ కు మాట్లాడే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆక్సాయ్ చిన్ ప్రాంతాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే 1962లో చైనాకు అప్పగించిందని.. కాంగ్రెస్ దేశానికి క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. అంతకుముందు, ఉదయం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఘన స్వాగతం లభించింది. అమెరికాతో కుదిరిన చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం దేశానికి ఎంతో ప్రయోజనకరమని పేర్కొంటూ ఎన్డీయే ఎంపీలు ప్రధానిని ఘనంగా సత్కరించారు. డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం దిగుమతి సుంకాలను 18 శాతానికి తగ్గించడం మోదీ దౌత్య విజయం అని ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చకు సంబంధించి లోక్‌సభలో మొత్తం 18 గంటల సమయాన్ని కేటాయించారు. ఈ చర్చ ముగిసిన అనంతరం ఫిబ్రవరి 4న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం ఇవ్వనున్నారు. అలాగే, కేంద్ర బడ్జెట్‌పై జరిగే చర్చకు సంబంధించి ఆర్థిక మంత్రి నిర్మలా



సీతారామన్ ఫిబ్రవరి 11న తన వివరణ ఇవ్వనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. మంగళవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలోనూ విపక్షాల నినాదాలతో సభ హోరెత్తింది. వివిధ అంశాలపై చర్చకు పట్టుబడుతూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లడంతో సభ సజావుగా సాగలేదు. అటు రాజ్యసభలోనూ వాణిజ్య ఒప్పందంపై పూర్తి వివరాలు వెల్లడించాలని కాంగ్రెస్ పట్టుబట్టింది. అయితే, ప్రభుత్వం అన్ని వివరాలను సభ ముందు ఉంచుతుందని సభా పక్ష నేత జేపీ నడ్డా స్పష్టం చేశారు.

# మేయర్ పదవి కోసం
# రూ. 8 కోట్ల చెల్లింపులు

- మొదటి పేజీ తరువాయి



ఎన్నికల పర్యవేక్షకులుగా మంత్రులను ముఖ్యమంత్రిని నియమించారు. వారంతా కూడా ఆయా ప్రాంతాలలో సమాలోచనలు.. సమావేశాలు నిర్వహిస్తున్నారు.ఒకవైపు ఎన్నికల ప్రక్రియ జరుగుతుండగానే.. మరోవైపు మున్సిపాలిటీలకు.. కార్పొరేషన్లకు భారీగా ఆదాయం వస్తోంది. ఎన్నికల్లో పోటీ చేసేవారు కచ్చితంగా ఆయా మున్సిపాలిటీలకు.. కార్పొరేషన్లకు ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా అభ్యర్థులు పన్నులు చెల్లిస్తున్న నేపథ్యంలో మునిసిపాలిటీలకు..కార్పొరేషన్లకు దండిగా ఆదాయం వస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో నిజామాబాద్ కార్పొరేషన్ కు ఏకంగా ఒక అభ్యర్థి 8 కోట్ల 16 లక్షలను చెల్లించింది. ఆమె ఇలా చెల్లించడం ఒకరకంగా సంచలనం కలిగించింది. నిజామాబాద్ నగర కార్పొరేషన్ పోటీలో ఉన్న శమంత నరేందర్ రెడ్డి ఏకంగా 8,16,65,000 కోట్ల ఆస్తి పన్ను బకాయి చెల్లించింది. శమంత కుటుంబానికి ఓ హోటల్ ఉంది. 2009 నుంచి ఈ హోటల్ ఆస్తిపన్ను చెల్లించలేదు. దీనిపై నిజామాబాద్ నగర్ కార్పొరేషన్ అధికారులు హైకోర్టు దాకా వెళ్లారు. శమంత కుటుంబ సభ్యులు కూడా హైకోర్టుకు వెళ్లారు. ఇరుపక్షాల మధ్య దాదాపు 17 సంవత్సరాల పాటు కోర్టులో వాదనలు జరిగాయి. చివరికి హైకోర్టు ఆస్తి పన్ను చెల్లించాలని తీర్పు ఇవ్వడంతో.. శమంత అన్ని కోట్లు కట్టేసింది. ఈమె అధికార కాంగ్రెస్ పార్టీ తరపున పోటీలో ఉంది. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తే మేయర్ అవ్వాలని ఈమె భావిస్తున్నారు. దానికంటే ముందుగానే 8 కోట్లకు మించిన ఆస్తి పన్ను నిజామాబాద్ కార్పొరేషన్ కు చెల్లించారు.

# నిరుద్యోగులను నమ్మించి నయవంచన..
# రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు

- మొదటి పేజీ తరువాయి



మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అడ్డదారిలో రేవంత్ గద్దె ఎక్కారన్నారు. ఇప్పుడు అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చి సీఎం ఫోటోలకు ఫోజు కొట్టారన్నారు. ఆ తర్వాత మొత్తానికే చేతులెత్తేయడంతో తెలంగాణలో 'రిక్రూట్‌మెంట్ జీరో'గా మారిపోయిందని మాజీ మంత్రి విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును తెలంగాణ సమాజం నిత్యం గమనిస్తోందని మాజీ మంత్రి చెప్పారు. తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు సీఎం ముక్కునేలకు రాసి క్షమాపణలు చెప్పినా క్షమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని విమర్శించారు.సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు రూ.2500 ఇస్తానని చెప్పిన మాటకు రెండేళ్లయినా ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని వ్యాఖ్యలు చేశారు. 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయమని హెచ్చరించారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.

# కడియం శ్రీహరికి
# స్పీకర్ నోటీసులు..

- మొదటి పేజీ తరువాయి

పలుమార్లు సుప్రీంకోర్టు స్పీకర్ ను ఆదేశించి. కోర్టు ఆదేశాలతో స్పీకర్ కార్యాలయం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణ ప్రక్రియను వేగవంతం చేసింది. రేపటి విచారణలో కడియం శ్రీహరి తన వాదనలను వినిపించనున్నారు. ఆయన ఇచ్చే వివరణ ఆధారంగా స్పీకర్ తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తన అనర్హత పిటిషన్‌పై స్పీకర్‌కు సమర్పించిన అఫిడవిట్ రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. తాను రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌ను ఉల్లంఘించలేదని, ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ కండువా కప్పుకుని, ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసినప్పటికీ, సాంకేతికంగా తాను పార్టీకి రాజీనామా చేయలేదని వాదించారు.గత మార్చిలో కాంగ్రెస్ సమావేశానికి హాజరైంది కేవలం వ్యక్తిగత హోదాలో మాత్రమేనని, మీడియా కథనాల ఆధారంగా తాను పార్టీ మారినట్లు భావించడం సరికాదని దానం పేర్కొన్నారు. బీఆర్ఎస్ తనను సస్పెండ్ చేయలేదని చెబుతూ, చట్టపరమైన లొసుగుల ద్వారా అనర్హత వేటు నుంచి తప్పించుకునే ఆయన ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. సుప్రీంకోర్టు గడువు సమీపిస్తున్న వేళ దానం వినిపించిన ఈ వింత వాదన బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.అనర్హత పిటిషన్ ఎదుర్కొన్న ఎమ్మెల్యేలలో బండ్ల కృష్ణ మోహన్, గూడెం మహిపాల్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, అరికపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్యలకు తెలంగాణ స్పీకర్ ఇదివరకే క్లీన్ చిట్ ఇచ్చారు. వీరిని బీఆర్ఎస్ సభ్యులుగా గుర్తిస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్ పిటిషన్లను విచారణ చేస్తున్నారు. ఇటీవల దానంను విచారించగా, తాజాగా కడియం శ్రీహరికి నోటీసులు ఇచ్చి విచారణకు మాజరు కావాలని ఆదేశించారు.

# పెరిగిన బంగారం, వెండి




**ముంబై, ఫిబ్రవరి 3:** బంగారం, వెండి ధరలు మళ్లీ పెరిగాయి. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో గత కొన్నిరోజులుగా ధరలు ఆకాశాన్నంటాయి. అయితే ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో రెండు మూడు రోజులుగా బంగారం ధరలు భారీగా పడిపోయాయి. అమెరికా ఫెడ్‌కు కొత్త ఛైర్మన్ నియామకం, సీఎంఈ మార్జిన్ పెంచడం, గరిష్ఠాల వద్ద ప్రాఫిట్ బుకింగ్ కారణంగా విలువైన ఈ లోహాల ధరలు భారీగా పతనమయ్యాయి. అయితే ఈరోజు ధరలు పుంజుకున్నాయి.హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఈరోజు మధ్యాహ్నం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1.56 లక్షలు పలికింది. సోమవారం నాటి ధరతో రూ.6 వేలు పెరిగింది. కిలో వెండి ధర రూ.2.74 లక్షలు పలికింది. కిలో వెండి ధర రూ.20 వేలకు పైగా పెరిగింది. అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో బంగారం ఔన్సు 4,887 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, వెండి 85.98 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది.

## గులాబికే ఆత్మగౌరవం

# పేటెంట్ రైట్స్...




**హైదరాబాద్, ఫిబ్రవరి 3:**బీఆర్ఎస్ పార్టీ చరిత్ర చూస్తే ఎప్పుడు కష్టాలు, సమస్యలు చుట్టుముట్టినా .. ఆపార్టీ నమ్ముకునేది తెలంగాణ సెంటిమెంట్. ఉద్యమ పార్టీగా మొదలై , ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత.. పదేళ్లపాటు పగ్గాలు చేపట్టింది. అప్పుడు ఎక్కడ చూసినా గులాబీ జెండాలే కనిపించేవి. పోలీసుల నుంచి అన్ని వ్యవస్థలు .. అప్పటి ప్రభుత్వం చెప్పినట్లు స్పందించేవి. అయితే ఇప్పుడు ప్రభుత్వం మారింది. వ్యవస్థలు కూడా.. ఇప్పటి ప్రభుత్వానికి అనుగుణంగా నడుస్తున్నాయి. దీంతో బీఆర్ఎస్ .. ఇరిటేట్ అవుతున్నట్లు కనిపిస్తోంది..ఫోన్ ట్యాపింగ్ కేసులో వ్యవహారం కాస్తా ఇప్పుడు కేసీఆర్ వరకూ వెళ్లింది. ఈ కేసులో ఆరోపణలపై సిట్ బృందం.. గులాబీ అధినేత కేసీఆర్ ను విచారించింది. ఇది బీఆర్ఎస్ శ్రేణులకు ఆగ్రహం తెప్పించింది. చావు నోట్లో తలపెట్టి, ప్రత్యేక రాష్ట్రం తెచ్చిన కేసీఆర్ ను.. సిట్ విచారణకు రమ్మంటారా అని ఆపార్టీ సీనియర్ నేతలు సైతం ఆక్షేపించారు. అంతేకాదు... ఇది కక్ష పూరితమంటూ ఆగ్రహించారు కూడా. అయితే చట్టం ముందు అందరూ సమానమే. గతంలో సీఎంలుగా ఉన్న సమయంలో హేమాహేమీలు జయలలిత, లాలు ప్రసాద్ యాదవ్, శిబు సొరెన్ సహా పలువురు దర్యాప్తు సంస్థల ముందు విచారణకు హాజరయ్యారు. కొందరు సీఎంలుగా ఉన్న సమయంలో అరెస్టయ్యారు కూడా. అది భారత చట్టం, రాజ్యాంగం ప్రకారం జరిగింది . అలాంటప్పుడు కేసీఆర్ కు మాత్రం ఎందుకు మినహాయింపు ఉంటుంది. ఆ విషయం బీఆర్ఎస్ నేతలకు తెలిసినా.. తెలియనట్లు వ్యవహరిస్తున్నారని చెప్పక తప్పదు. ఇక కేసీఆర్ ను టచ్ చేస్తే.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేసినట్లు అని మరికొందరు బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. ప్రత్యేక రాష్ట్రం వచ్చింది. పదేళ్లు గడిచాయి. ఇంకా ఆత్మగౌరవమంటూ.. ట్యాపింగ్ కేసు విచారణ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడడంపై .. తెలంగాణ ఉద్యమ కారుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తప్పు చేయకుంటే.. విచారణకు సహకరించి, శుద్ధపూసలా బయట పడాలని వారు చెబుతున్నారు. అంతేకానీ.. తమనేతను విచారణ చేయకూడదన్నట్లు వ్యవహరించొద్దన్నది వారు సూచనగా ఉంది.


## ఎంఐఎంకు షిఫ్ట్ అవుతున్న ముస్లింలు....



**హైదరాబాద్, ఫిబ్రవరి 3:**భారత దేశంలో దాదాపు అన్నీ సెక్యూలర్ పార్టీలే. బీజేపీ, శివసేన మాత్రమే హిందుత్వ పార్టీలుగా గుర్తింపు పొందాయి. చిన్న పార్టీలు ఉన్నా బలమైన పార్టీలు మాత్రం బీజేపీ, తర్వాత శివసేన. కాంగ్రెస్, ఎస్పీ, త్రుణమూల్ కాంగ్రెస్, ఆప్, సీపీఐ, బీఎస్పీతోపాటు ప్రాంతీయ పార్టీలు లౌకిక పార్టీలుగా చెప్పుకుంటాయి. అయితే ఇప్పుడు ఈ సెక్యూలర్ పార్టీలకు కొత్త ముప్పు రాబోతోంది. ఎంఐఎం (అఖిల్ భారత్ మజ్లిస్--ఇ--ఇత్తిహాదుల్ ముస్లిమీన్) సెక్యూలర్ పార్టీలకు భవిష్యత్‌లో చెక్ పెట్టబోతోంది. ఇప్పటికిప్పుడు అధికారం సాధించకపోయినా, ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తోంది. కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎంఐఎం మద్దతు కీలకం. కర్ణాటకలో ముస్లిం నాయకులు ఎంఐఎంను పోటీ నుంచి ఉపసంహరించారు. తెలంగాణలో నగరాల్లో అభ్యర్థులు నిలిపి, బీఆర్ఎస్‌కు ఓట్లు వదిలేశారు. కాంగ్రెస్ మూడు రాష్ట్రాల్లో రెండిటిలో ఎంఐఎం సహాయంతోనే గెలిచింది. బిహార్ సిమాంచల్‌లో కాంగ్రెస్ 19 నుంచి 6 సీట్లకు పడిపోయింది. ఎంఐఎం 5 సీట్లు సాధించి సమానంగా నిలిచింది. మహారాష్ట్ర మున్సిపల్‌లో 13 మున్సిపాలిటీల్లో 116 సీట్లు. శంభాజీనగర్‌లో 33, విదర్భ, మారేగావ్‌లో 21, నాందేడ్‌లో 14, ధులేలో 10, షోలాపూర్‌లో 8. ముంబైలో ఎన్సీపీ, ఎంఎన్ఎస్ కంటే ఎక్కువ 8 సీట్లు. సమాజ్‌వాదీ పార్టీ ఒక్క సీటు కూడా లేకుండా పోయింది. ముస్లింలు సెక్యులర్ పార్టీలతో ప్రయోజనం లేదని గ్రహించారు. అందుకే ఆర్జేడీ, జేడీయూ ఓట్లు కోల్పోయాయి. తెలంగాణలో కాంగ్రెస్ బీఆర్ఎస్‌కు ఓటు వెళ్లాయి. గుజరాత్ అహ్మదాబాద్ మున్సిపల్‌లో ఎంఐఎం 4 సీట్లు గెలిచింది. త్వరలో అసోం, బెంగాల్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ రెండుచోట్ల పోటీ చేయాలని ఎంఐఎం భావిస్తోంది. అసోంలో యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్‌తో చేతులు కలిపేందుకు చర్యలు ప్రారంభించింది. ఇదే జరిగితే ముస్లింలు కాంగ్రెస్‌కు పూర్తిగా దూరమవుతారు. ఇక బెంగాల్‌లో ఇండియన్ సెక్యూలర్ ఫ్రంట్ అనే పార్టీ ఉంది. ఐఎస్ఎఫ్, ఎంఐఎంలు రెండూ చేతులు కలిపే అవకాశాలు ఉన్నాయి. దీంతో లౌకికవాదుల ఓట్లు తగ్గిపోకే అవకాశం ఉంది. ఇక ఉత్తర ప్రదేశ్‌లో గతంలో పోటీచేశారు. ఈసారి చిన్న పార్టీలతో కలిసి పోటీ చేయాలని ఎంఐఎం భావిస్తోంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో మజ్లిస్ ఐదారు స్థానాలు గెలిచింది. ఈసారి ఎన్నికల్లో ముస్లిం ఓట్లు ఎంఐఎం సాధించేలా ఒవైసీ ప్రయత్నం చేస్తున్నారు. మొత్తంగా ముస్లింలు సెక్యులర్ పార్టీతలో ఎలాంటి లాభం లేదన్నది అర్థమవుతోంది. ఈ భావన ముస్లింలలో బలపడుతోంది. దీంతో ముస్లింలు ఎంఐఎంవైపు మొగ్గ చూపుతున్నారు. ఈ ట్రెండ్ కాంగ్రెస్ 'సంఘటన్ సృజన్' ప్రయత్నాలను వృథా చేస్తుంది. ముస్లింలు ఎంఐఎంను ఎంచుకుంటే సెక్యులర్ పార్టీల ఓటుబ్యాంక్ క్షీణిస్తుంది. బీజేపీకి ప్రయోజనం దక్కవచ్చు. ఎంఐఎం గెలుపు రాజకీయ డైనమిక్స్‌ను మార్చే అవకాశం ఉంది.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజీనామా

*మల్లు రవి, వంశీకృష్ణల పై ఆరోపణలు*



**హైదరాబాద్:**నాగర్కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణల కుల రాజకీయాల వల్ల పార్టీకి రాజీనామా చేస్తున్నానని కాంగ్రెస్ పార్టీకి రాజీనామా స్తున్నానని ఎస్సీ సెల్ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు అడ్వకేట్ మల్లెపల్లి జగన్ అన్నారు. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ మాల కుల రక్షకులుగా, మాదిగ కుల భక్షకులుగా మారారని, వీరి ప్రవర్తనతో విసుగు చెందానని అయన ఆరోపించారు. కల్వకుర్తిలోని ఒక వార్డులో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేని ఒక మాల కులస్థుడికి బీ ఫారం ఇచ్చి పార్టీ ఓటమికి కారణమవుతున్నారని ఆరోపించారు. రెండు దశాబ్దాలుగా పార్టీకి సేవలు చేశానని, మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ కారణంగా పార్టీకి రాజీనామా చేస్తున్నానని అన్నారు.

## వర్ధన్నపేటలో వాడివేడిగా ఎన్నికల ప్రచారం

**వరంగల్:**వరంగల్ జిల్లా వర్ధన్నపేట లో మున్సిపల్ ఎన్నికల ప్రచారం వాడి వేడిగా కొనసాగుతోంది. అధికార పార్టీ ఎమ్మెల్యే నాగరాజు ను ప్రశ్నిస్తూ బిజెపి నేతలు 15 అంశాలతో కూడిన ఛార్జ్ షీట్ ను విడుదల చేశారు. వర్ధన్నపేటలో నెలకొన్న సమస్యలను చార్జి సీట్లో ప్రస్తావిస్తూ గడిచిన రెండేళ్లుగా ఎమ్మెల్యే నాగరాజు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

## 42వ డివిజన్‌లో కాంగ్రెస్ ప్రచారం..

# భారీ జనసమ్మేళనం

42వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి పబ్బు సైశ్రీ తన ఎన్నికల ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించారు. ప్రచార ప్రారంభంలో పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పాల్గొని ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. పబ్బు సైశ్రీ డివిజన్‌లోని పలు ప్రాంతాలను సందర్శిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం మరియు ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడానికి కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో పారదర్శక, ప్రజాకేంద్రిత పాలన అందిస్తానని పబ్బు సైశ్రీ తెలిపారు. భారీ జనసమ్మేళనం మరియు ప్రాజ్ఞాపనలో భాగంగా 42వ డివిజన్‌లో



రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. కాంగ్రెస్ పార్టీపై ప్రజల విశ్వాసం స్పష్టంగా కనిపిస్తోంది.

## 14వ డివిజన్‌లో బీజేపీ ప్రచారం..

**ప్రజల ఆశీస్సులు కోరిన శ్రీ బీపంగి జగ్జీవన్ రామ్**

14వ వార్డు / 14వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి శ్రీ బీపంగి జగ్జీవన్ రామ్ గారు ప్రజల మద్దతు కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, కమలం గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని వినమ్రంగా అభ్యర్థించారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రజలను నేరుగా కలుసుకుంటూ వారి సమస్యలను తెలుసుకున్న ఆయన, ప్రజాసేవే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రచార కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ ప్రచారంతో




14వ డివిజన్‌లో ఎన్నికల వాతావరణం వేడెక్కగా, బీజేపీ అభ్యర్థికి ప్రజల నుంచి సానుకూల స్పందన లభిస్తోంది.

## 41వ డివిజన్‌లో బీఆర్ఎస్ హవా..

**భారీ ప్రజా మద్దతుతో ప్రచారం సాగిస్తున్న ఏవీఎల్ నరసింహారావు**

41వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ అభ్యర్థి ఏవీఎల్ నరసింహారావు ఎన్నికల ప్రచారం భారీ ప్రజా మద్దతుతో జోరుగా కొనసాగుతోంది. డివిజన్ పరిధిలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహం వ్యక్తం చేశారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసిన ఏవీఎల్ నరసింహారావు స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రజలతో కలిసి డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమని తెలిపారు. ప్రచారానికి లభిస్తున్న



స్పందనతో 41వ డివిజన్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కగా, బీఆర్ఎస్ అభ్యర్థికి ప్రజల మద్దతు స్పష్టంగా కనిపిస్తోంది.

## 26వ డివిజన్‌లో కాంగ్రెస్ హవా..

**ఆసిఫా సుల్తానా బషీరుద్దీన్‌కు మద్దతుగా కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భారీ జనసంద్రం**





నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్ కాంగ్రెస్ కార్పొరేటర్‌గా ఎన్నికైన శ్రీమతి ఆసిఫా సుల్తానా బషీరుద్దీన్ (వీ.నా., దీ.జు.ఎ.) కు మద్దతుగా ఈరోజు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పాల్గొని డివిజన్‌లో రాజకీయ ఉత్సాహాన్ని నెలకొల్పారు. కార్యక్రమంలో మాట్లాడిన ఆసిఫా సుల్తానా బషీరుద్దీన్ ప్రజలు తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. హస్తం గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. 26వ డివిజన్ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, పారిశుధ్యం, సీసీ రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే నాయకత్వం ఆసిఫా సుల్తానా బషీరుద్దీన్‌లో ఉందని ప్రశంసించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, స్థానికంగా ఉన్నా ప్రజల పక్షానే నిలబడుతుందని ఆయన స్పష్టం చేశారు.

## 5వ డివిజన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పున్న జ్ఞానేశ్వరి గణేష్ ప్రచారం ప్రారంభం

5వ డివిజన్ కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థి పున్న జ్ఞానేశ్వరి గణేష్ తన ఎన్నికల ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలను కవర్ చేసిన ప్రచారంలో పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. ప్రముఖ సమస్యలైన తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కేంద్రీకృతమై ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వారికి తక్షణ పరిష్కారాలు చేయడానికి కట్టుబడి ఉంటానని జ్ఞానేశ్వరి గణేష్ హామీ ఇచ్చారు. ప్రచారంలో ఆమె ప్రజలతో ఇంటింటికీ వెళ్లి చర్చలు జరిపి వారిని కలిసిన సందర్భంగా ప్రజల భాగస్వామ్యంతో పారదర్శక, ప్రజా మన్ననల పాలన అందిస్తానని స్పష్టం చేశారు. భారీ ప్రజా మద్దతుతో 5వ




డివిజన్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కగా, కాంగ్రెస్ అభ్యర్థి పున్న జ్ఞానేశ్వరి గణేష్ సాధారణ ప్రజల విశ్వాసాన్ని సంపాదించారని ప్రచారంలో స్పష్టంగా కనిపిస్తోంది.

## 18వ డివిజన్‌లో రాజకీయ ఉత్కంఠ..

**ప్రచార బాట పట్టిన ఆలకుంట్ల ఝాన్సీ రాణి నాగరత్నం రాజు**

18వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా ఆలకుంట్ల ఝాన్సీ రాణి నాగరత్నం రాజు తన ఎన్నికల ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించారు. డివిజన్‌లోని పలు కాలనీలు, వీధుల్లో నిర్వహించిన ప్రచారంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమైన ఆమె, స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. తాగునీరు,



పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో పారదర్శక పాలన అందించడమే తన లక్ష్యమని తెలిపారు. ప్రచారానికి లభించిన స్పందనతో 18వ డివిజన్‌లో ఎన్నికల సందడి మరింత ఊపందుకోగా, రాజకీయ వాతావరణం ఆసక్తికరంగా మారింది.

# ఖమ్మంలో మోడల్ మార్కెట్..

**ఖమ్మం, ఫిబ్రవరి 3:**ఖమ్మం జిల్లా రైతులకు త్వరలో శుభవార్త అందనుంది. కొత్త మోడల్ మార్కెట్ అందుబాటులోకి రానుంది. గత నెల ఫిబ్రవరి నుంచి నిర్మాణం చేపడుతుండగా.. ఈ నెలలోనే పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. మొత్తం 7 షెడ్లు నిర్మిస్తుండగా.. 5 షెడ్ల నిర్మాణం పూర్తయింది. ఈ నెలాఖరు నాటికి మిగిలిన రెండు షెడ్ల నిర్మాణాలు కూడా పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు. ఖమ్మంలో కొత్త మార్కెట్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పాత మార్కెట్ స్థానంలోనే షెడ్లను కూల్చివేసి.. రూ.155.45 కోట్లతో 15 ఎకరాల స్థలంలో ఆధునిక వసతులతో కొత్తగా మార్కెట్ ను నిర్మిస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సొంత నియోజకవర్గం కావడంతో.. రాష్ట్రంలోనే మోడల్ మార్కెట్ గా దీన్ని తీర్చిదిద్దాలని ఆయన ప్లాన్ చేశారు. గత సంవత్సరం ఫిబ్రవరి నెలలో నిర్మాణ పనులు ప్రారంభం కాగా.. మొత్తం ఏడు షెడ్లను నిర్మిస్తున్నారు. అయితే ఇప్పటికే 5 షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయగా.. మిగతా రెండు షెడ్ల నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోంది. రైతు పండుగగా భావించే సంక్రాంతి నాటికి కొత్త వ్యవసాయ మార్కెట్ ను పూర్తి స్థాయిలో రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ప్లాన్ చేసినా కొన్ని కారణాల వల్ల కుదరలేదు. ఈ మార్కెట్ పనులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈ నెలలో మార్కెట్‌ను



ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. మిర్చి మార్కెట్ అంటే తెలంగాణలో మొదట గుర్తుకు వచ్చేది ఖమ్మం జిల్లా. ఇక్కడ ధరలు తెలంగాణలో ఎక్కడా లేని విధంగా ఉంటాయి. అంతే కాదు.. మిర్చి పంటను అమ్ముకోవడానికి కూడా రైతులు భారీగా వస్తుంటారు. ఆ మార్కెట్‌కు ఘనమైన చరిత్ర ఉంది. 1937వ సంవత్సరంలో దీనిని ప్రారంభించగా.. ఆ సమయంలో అన్ని రకాల పంటల ఉత్పత్తుల కొనుగోళ్లు, అమ్మకాలు ఇక్కడ ఉండేవి. తర్వాత 1967లో ఈ స్థలంలోనే మిర్చి మార్కెట్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అయితే 2017 సంవత్సరంలో ఇక్కడకు సామర్థ్యానికి మించి మిర్చి బస్తాలు రావడంతో.. మార్కెట్లో కాస్త గందరగోళం ఏర్పడింది. పోటెత్తిన మిర్చి కొనుగోళు ్ల సరిగ్గా జరగకపోవడంతో కొంత మంది రైతులు మార్కెట్‌ను ధ్వంసం చేశారు. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకొని మంత్రి తుమ్మల మార్కెట్‌ను విస్తరించాలని నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్‌కు తమ ఉత్పత్తులను అమ్మకానికి వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కారం చూపాలని మంత్రి భావించారు. దీనిలో భాగంగానే ఇంజనీరింగ్ నిపుణులతో చర్చించి.. మోడల్ మార్కెట్ ప్లాన్ చేశారు. ఒకప్పుడు 80 వేల బస్తాల వరకు సామర్థ్యం ఉండగా.. దానిని రెండు లక్షల బస్తాల వరకు విస్తరిస్తూ నూతన మార్కెట్ నిర్మాణం చేస్తున్నారు. ఈ మార్కెట్లో రైతులు విశ్రాంతి తీసుకోవడానికి ఆధునిక గదులు, మూడు టాయిలెట్ బ్లాక్స్, నాలుగు ఆర్వో వాటర్ ప్లాంట్స్ నిర్మాణం చేస్తున్నారు. అంతే కాకుండా.. రైతులు టిఫిన్స్, భోజనం చేసేందుకు క్యాంటీన్ సౌకర్యం కూడా అందుబాటులో ఉండేలా నిర్మిస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ షెడ్ ఏరియా 1.20 లక్షల స్క్వేర్ ఫీట్లు ఉంటే.. దాన్ని 3.50 లక్షల స్క్వేర్ ఫీట్లకు పెంచనున్నారు. మొత్తం ఏడు షెడ్లు నిర్మిస్తుండగా.. ఒక్కో షెడ్ 121 మీటర్ల పొడవు, 27 మీటర్ల వెడల్పు ఉంటుంది. ఈ స్థలంలోనే అవసరమైతే తమ ఉత్పత్తులను కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# మెదక్ లో గులాబి ఆపరేషన్ ఆకర్ష్..

**మెదక్, ఫిబ్రవరి 3:**మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్లో చేరికల జోష్ కనిపిస్తున్నది. హస్తం పార్టీ నాయకులు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు. మళ్లీ అభివృద్ధి జరగాలన్నా.. సంక్షేమ పథకాలు అమ లు కావాలన్నా కేసీఆర్ రావాలన్న అభిప్రా యం వ్యక్తం చేస్తున్నారు. అందుకు తమ మద్దతు అవసరమని భావిస్తూ.. గులాబీ పార్టీలోకి వస్తున్నారు. మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్, రామాయంపెట్, తూప్రాన్ మున్సిపాలిటీ ల నుంచి కాంగ్రెస్ పార్టీ నేత లు,ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో చేరుతున్నారముున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్ ఎన్నికలపై సీరియస్గా దృష్టి సా రించింది. ఇప్పటికే మెదక్ జిల్లా వ్యాప్తంగా వ్యూహాత్మకంగా ప్రణాళికలు రచిస్తోంది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు నేతృత్వంలో వరుసగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మ కంగా తీసుకుంది. గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే ప ద్మా దేవేందర్ రెడ్డి, మున్సిపల్ ఎన్నికల ఇం చార్జి, మాజీ ఎశ్రీఎ ఫారూక్ హుస్సేన్ వరుస సమీక్షలతో కేడర్లో జోష్ నింపుతున్నారు. ఈ క్రమంలోనే పట్టణ ప్రాంతాల్లో తన పట్టును నిరూపించుకోవడానికి బీఆర్ఎస్




శతవిధాలా ప్రయత్నిస్తోంది. మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ దూ కుడు ప్రదర్శిస్తోంది. మెదక్ జిల్లాలో నాలు గు మున్సిపాలిటీల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నిక ల్లో తమ మద్దతుదారులు మంచి ఫలితాలు సాధించారని, అదే ఊపును మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేశారు. పట్టణ ఓటర్లు ఎప్పుడూ అభివృద్ధిని కోరుకుంటారని తమవైపే ఉంటారని బీఆర్ఎస్ నేతలు చెబుతు న్నారు. కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి జరిగిందనే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని భావిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫ ల్యాలను ఎండగట్టాలని నిర్ణయించుకుంది. గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో పట్టణాల్లో ఒక్క రూపాయి కూడా అభివృద్ధి పనులకు ఖర్చు చేయలేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. రేవంత్రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని భావిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన మిషన్ భగీరథ, పలు పథకాల నిర్వహణను కాంగ్రెస్ గాలికొదిలేసిందని విమర్శిస్తున్నారు.

Printed, Published & Owned by **KANDI SURYA NARAYANA,** Printed at Parthasarathi Offset Printers, Prakasham Bazar, Nalgoda - 508 001, T.G
Editor : **KANDI SURYA NARAYANA,** D.No. 5-6-109/B1, Bottuguda Nalgonda-508 001, T.G. Cell : 98480 52327, , **Email : cheekativelunewsdaily@gmail.com**